

మాట్లాడుతున్న జస్టిస్ బి.చంద్రకుమార్

ఇళ్లలో పనిచేసే కార్మికులకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి

● జస్టిస్ బి.చంద్రకుమార్

రాంనగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలో పనిచేసే వారు, ఇళ్ల నుంచి చెత్త సేకరించే మహిళా కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని జస్టిస్ బి. చంద్రకుమార్ సూచించారు. వీరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మౌంట్‌ఫోర్ట్ సోషల్ ఇన్‌స్టిట్యూట్, యువ కార్మికుల యూనియన్, హైదరాబాద్ గార్బేజ్ కలెక్టివ్ సంఘాల సంయుక్తాధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ బి.చంద్రకుమార్, ప్రొఫెసర్ ఎం.కోదండరాం, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య, సామాజిక కార్యకర్తలు ఖలీదా పర్వీన్, సజయ, డాక్టర్ వనమాల, అంబిక, దీపక్‌జాన్, కల్పన, కిరణ్‌కుమార్ తదితరులు మాట్లాడారు. ఇళ్లలో పనిచేసే, చెత్త సేకరించే మహిళా కార్మికుల కోసం సామాజిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కనీస వేతనం 12 వేలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని, వీక్లీపెయిడ్ హాలీడే ఇవ్వాలని, ప్రతి ఇంటి నుంచి నెలకు 250 రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించాలని, సామాజిక రక్షణ, ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మౌంట్‌ఫోర్ట్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ వర్గీస్ తేకనాథ్, మంజుల, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.


మహిళా దినోత్సవంలో పాల్గొన్న
బీఆర్ఎస్ మహిళా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శోభారాణి, స్రవంతి తదితరులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ముషీరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం సమగ్రాభివృద్ధి చెందుతుందని బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ మహిళా కమిటీ అధ్యక్షురాలు శోభారాణి అన్నారు. బుధవారం కమిటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను అధ్యక్ష, కార్యదర్శులు శోభారాణి, స్రవంతి సన్మానించారు. శోభారాణి మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో మహిళలు ముందు వరుసలో ఉండాలన్నారు. కార్యక్రమంలో మహిళా కమిటీ నాయకులు అరుణ, మేరి, ఆకుల పద్మ, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి

చిక్కడపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చదివిన మేరకు రాయగలమన్న నమ్మకమే పరీక్ష భయానికి విరుగుడు అని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డా.హిప్నో పద్మాకమలాకర్ అన్నారు. ఈనెల 18 నుంచి 10వ తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో బుధవారం అశోక్‌నగర్‌లోని మైండ్ అండ్ పర్సనాలిటీకేర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ప్రశ్నకు సమయం నిర్ణయించుకోవాలని, తెలిసిన ప్రశ్నలకు సమాధానం ముందు రాయాలన్నారు. పరీక్ష హాల్ నుంచి బయటకు వచ్చిన తర్వాత రాసిన పరీక్ష గురించి ఆలోచించకుండా తర్వాత రాయబోయే పరీక్షకు సిద్ధం కావాలని సూచించారు. తల్లిదండ్రులు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందిస్తే పిల్లలు పరీక్ష బాగా రాయగలరన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి
క్షీరాభిషేకం చేస్తున్న ఎరుకల సంఘం నాయకులు

పలు కార్పొరేషన్ల ఏర్పాటు నిర్ణయం హర్షణీయం

కవాడిగూడ/చిక్కడపల్లి/గోల్నాక/రాంనగర్/బర్కత్‌పుర, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మాల, మాదిగల ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్, మున్నూరు కాపు, పద్మశాలి, ఎరుకల, రెడ్డి కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని కేబినెట్‌లో నిర్ణయించడం హర్షణీయమని ఆయా సంఘాల నేతలు అన్నారు. ఏకలవ్య ఎరుకల సంఘం జేఏసీ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావుకు పద్మశాలీలు, మున్నూరుకాపు నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు

● డ్రైనేజీ పైపులైన్ల ఆధునికీకరణకు చర్యలు
● 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో జలమండలి బోట్స్ క్లబ్ సబ్ డివిజన్ డీజీఎం కార్తీక్‌రెడ్డి

కవాడిగూడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జలమండలి బోట్స్‌క్లబ్ సబ్ డివిజన్ పరిధిలో వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని డీజీఎం జి. కార్తీక్‌రెడ్డి తెలిపారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా తీసుకుంటున్న చర్యలపై 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు.



ఆంధ్రజ్యోతి: బోట్స్‌క్లబ్ సబ్ డివిజన్ పరిధిలోకి ఏ ప్రాంతాలు వస్తాయి?

డీజీఎం: కవాడిగూడ, బోలక్‌పూర్, గాంధీనగర్, దోమలగూడ సెక్షన్‌లు వస్తాయి.

ఆంధ్రజ్యోతి: సబ్ డివిజన్ పరిధిలో ఎన్ని కనెక్షన్‌లు ఉన్నాయి? ఎంతమందికి ఉచిత నీటి పథకం అమలవుతోంది?

డీజీఎం: 18 వేల కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 11 వేలమంది ఉచిత నీటి పథకం ద్వారా లబ్ధిపొందుతున్నారు. మిగతావారు బిల్లులు చెల్లిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: ఎన్ని పవర్‌బోరింగ్‌లు ఉన్నాయి. వీటిలో ఎన్ని పనిచేస్తున్నాయి. కొత్త పవర్ బోరింగ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారా?

డీజీఎం: పవర్ బోరింగ్‌లు 26 ఉన్నాయి. వీటిలో 15 పనిచేస్తున్నాయి. నీటి ఎద్దడిని నివారించేందుకు పవర్‌బోర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం.

ఆంధ్రజ్యోతి: బోట్స్ క్లబ్ సబ్ డివిజన్ పరిధిలో ఎన్ని హ్యాండ్ పంప్‌బోరింగ్‌లు ఉన్నాయి?

డీజీఎం: మొత్తం 210 హ్యాండ్ పంప్ బోరింగ్‌లు ఉన్నాయి. వీటిలో 43 పనిచేస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి: కవాడిగూడ, దోమలగూడ ప్రాంతాల్లో నిత్యం డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. పైపులైన్లను ఆధునికీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నారా?

డీజీఎం: కలుషిత నీరు సరఫరా అవుతోందని, డ్రైనేజీలు పొంగుతున్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో జనాభాకు అనుగుణంగా పైపులైన్ల ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించాం.

ఆంధ్రజ్యోతి: డ్రైనేజీల నుంచి వ్యర్థాలను తొలగించి రోజుల తరబడి అక్కడే ఉంచుతున్నారు. ఈ విషయం మీ దృష్టికి వచ్చిందా?

డీజీఎం: ఫిర్యాదులు వస్తున్నాయి. వ్యర్థాలను రెండు రోజుల్లో తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

ముషీరాబాద్‌లో పార్కుల సుందరీకరణకు చర్యలు

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో పార్కుల సుందరీకరణకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. బుధవారం దోమలగూడ ఈ-సేవ వద్దగల పార్కులో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులు, కవాడిగూడ మసీదు గల్లీలో రూ. 6 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ రచనశ్రీతో కలిసి శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్, పరిమళ్‌కుమార్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వల్లాల శ్యామ్ యాదవ్, ఎన్‌డీ సాయికృష్ణ, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఎంసీ మహేందర్ బాబు, డీఈ సన్ని, ఏఈ సుభాష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్ పాల్గొన్నారు.


దోమలగూడ ఈ సేవ వద్ద పార్కులో అభివృద్ధి పనులకు
శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ జి. రచనశ్రీ

గాంధీనగర్ డివిజన్‌లో రూ.9 లక్షలతో పైపులైన్‌లు

చిక్కడపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ ఎల్లయ్య బస్తీలో రూ. 3.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న సివరేజీ పైపులైన్, బాపూనగర్‌లో రూ. 5.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసే తాగునీటి పైపులైన్ పనులను ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ పావని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ, బీఆర్ఎస్ నేతలు వినయ్ కుమార్, ఉమేష్ రత్నసాయిచంద్, జైసింహ, రాకేష్, ముచ్చకుర్తి ప్రభాకర్, వాటర్ బోర్డు డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

చిక్కడపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ ఎస్ఆర్‌టి కాలనీలోగల ప్రభుత్వప్రాథమిక పాఠశాలలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను, బల్లలు, కుర్చీలు, అల్మారాలను ఎంపీ డా. లక్ష్మణ్, కార్పొరేటర్ ఎ. పావని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాలక్రమేణా ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగవుతున్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతోపాటు అందరిపై ఉందన్నారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, సీనియర్ నేతలు శ్రీకాంత్, నవీన్ కుమార్, శ్రీనివాస్, అరుణ్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.


ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న డా. లక్ష్మణ్


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

మారుతీగనర్‌లో ఎమ్మెల్యే పాదయాత్ర

గోల్నాక, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మారుతీనగర్‌లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బుధవారం పాదయాత్ర చేశారు. బస్తీలో డ్రైనేజీ పైపులైన్, సీసీ రోడ్డు నిర్మించాలని, వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బి.లింగంగౌడ్, ఎ.సురేష్‌గౌడ్, బోదాసు శేఖర్, అధికారులు పాల్గొన్నారు.

రాయప్రోలు భావకవిత్వంలో వేసిన బాట శాశ్వతం

చిక్కడపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాయప్రోలు సుబ్బారావు భావకవిత్వంలో వేసిన బాట శాశ్వతమని ప్రముఖ సినీ గీత రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు అన్నారు. బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో వంశీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆచార్య రాయప్రోలు సుబ్బారావు 132వ జయంతి సందర్భంగా తొలి అచ్చతెలుగు అవధాని డా.పాలపర్తి శ్యామలానంద ప్రసాద్‌కు రాయప్రోలు వంశీ జాతీయ సాహిత్య జీవన సాఫల్య పురస్కారం ప్రదానసభ జరిగింది. ముఖ్యఅతిథిగా జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు పాల్గొని పురస్కారం బహూకరించి మాట్లాడారు. అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త డా.ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ.. పురస్కారగ్రహీత శ్యామలానందప్రసాద్ అవధానవిద్యలో నూతన మార్గం ఎంచుకుని పేరు పొందారని తెలిపారు. తెలుగు అకాడమీ పూర్వ సంచాలకులు డా. యాదగిరి, రాయప్రోలు కుమారుడు ప్రభాకర్‌రావు, కుటుంబసభ్యులు మనోరమ, అపర్ణ, మహాలక్ష్మి, ఉష, సుమ, వంశీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.


శ్యామలానంద ప్రసాద్‌కు పురస్కారాన్ని
బహూకరిస్తున్న జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు


నగర కార్యాలయంలో సంబరాల్లో టీడీపీ నాయకులు

ఎన్టీఆర్‌కు భారతరత్న నిర్ణయంపై టీడీపీ సంబరాలు

రాంనగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించడం హర్షణీయమని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా అన్నారు. బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తూ టీడీపీ నగర కార్యాలయంలో నగర నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంపిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నగర ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పలుస బాల్‌రాజ్‌గౌడ్, రవీంద్రచారి, ఎం.కె.బోస్, నాగు నగేష్, రాంనారాయణయాదవ్, జి.యాదగిరిరావు, పి.నందకిషోర్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు హాస్టల్‌ను ఆధునికీకరిస్తున్నాం

బర్కత్‌పుర, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు హాస్టల్‌ను ఆధునికీకరిస్తున్నామని విద్యార్థి వసతిగృహం ట్రస్టు బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ ఎం.ఆర్. వెంకట్రావ్ తెలిపారు. బుధవారం హాస్టల్‌లో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ విద్యా సంవత్సరం మెస్ ప్రారంభిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్టీలు పొన్నల విష్ణువర్ధన్, పిల్లి శ్రీనివాస్‌రావు, ఆకుల నగేష్, దేవేందర్, చంద్రమోహన్ పాల్గొన్నారు.


ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ ఎం.ఆర్.వెంకట్రావ్



మొల్లకు ఘన నివాళి

మొల్ల జయంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై గల ఆమె విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కుమ్మర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, నాయకులు తీగుల యాదగిరి, అశోక్, జయంత్‌రావు తదితరులు.

- కవాడిగూడ, ఆంధ్రజ్యోతి


నాగోల్‌లో ఎస్టీపీని పరిశీలిస్తున్న వాటర్ బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డి, అధికారులు

ఎస్టీపీల పనుల పరిశీలన

హైదరాబాద్ సిటీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డు చేపడుతున్న ఎస్టీపీ ప్రాజెక్టులో భాగంగా.. నాగోల్, అంబర్‌పేట్‌లో నిర్మిస్తున్న మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఎండీ సుదర్శన్ రెడ్డి బుధవారం పరిశీలించారు. మొదట నాగోల్ ఎస్టీపీకి వెళ్లిన ఆయన.. పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను త్వరగా పూర్తిచేయాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సివిల్ పనులు పూర్తి చేసి ఎలక్ట్రో మెకానిక్ యంత్రాల బిగింపు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం అంబర్‌పేట ఎస్టీపీని పరిశీలించారు. కార్యక్రమంలో ఈడీ డా. ఎం. సత్యనారాయణ, డైరెక్టర్ శ్రీధర్‌బాబు, సుదర్శన్, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ జోడోయాత్రపై వ్యాసరచన పోటీలు

బర్కత్‌పుర, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్రపై రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నామని నేషనల్ ఓబీసీ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. రాహుల్‌గాంధీ జోడోయాత్ర - భారతదేశంపై దాని ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. తెలుగు, ఇంగ్లిష్ భాషలో వ్యాసాన్ని రాసి ఈ నెల 31వ తేదీలోపు వాట్సాప్ నంబర్ 9966944233కు లేదా ఆళ్ల రామకృష్ణ, విల్లా నెంబర్ 42, సైబర్ మెడోస్ సొసైటీ కొండాపూర్, హైదరాబాద్-84కు పంపించాలని కోరారు.

విజేతలకు ప్రథమ బహుమతి లక్ష రూపాయలు, ద్వితీయ రూ. 75వేలు, తృతీయ బహుమతి రూ. 50వేలు, పదిమందికి రూ. 10 వేల ప్రోత్సాహక బహుమతి అంజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏప్రిల్ 7వ తేదీన రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

కవాడిగూడ సెక్టార్-3 ఎస్ఐగా నయీమ్‌ఖాన్



కవాడిగూడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ కవాడిగూడ సెక్టార్-3 ఎస్ఐగా నయీమ్‌ఖాన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో కవాడిగూడ ఎస్ఐగా పని చేసిన ఎస్. కావ్య ట్రైనింగ్ సెంటర్‌కు బదిలీ అయ్యారు. కవాడిగూడ సెక్టార్‌లో నేరాల నివారణకు కృషి చేస్తామని నయీమ్‌ఖాన్ తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

ముషీరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాజపేట చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఆర్. ఆంజనేయులు ఆధ్వర్యంలో ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు బుధవారం అల్పాహారం పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ, ఉపాధ్యాయులు నరేందర్ యాదవ్, రత్నం, ట్రస్ట్ ప్రతినిధులు కమల్ కుమార్ శర్మ, శ్రీనివాస్ పటాలే పాల్గొన్నారు.

పేదలకు పండ్లు..

ఎమ్మెల్సీ కల్వకుంట కవిత పుట్టిన రోజు సందర్భంగా బుధవారం ముషీరాబాద్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డి. శివముదిరాజ్ ఆధ్వర్యంలో పేదలకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ చేతుల మీదుగా పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, మహిళా కమిటీ నాయకురాలు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

బోరు తవ్విస్తున్న ఇంటి యజమానిపై కేసు

బర్కత్‌పుర, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బోరు తవ్విస్తున్న ఇంటి యజమానిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. చప్పల్‌బజార్‌లో సంగం హోటల్ ఎదుట అధికారుల అనుమతి లేకుండా, కోర్టులో కేసు ఉన్న స్థలంలో బోరు తవ్విస్తున్నారు. స్థానికుల సమాచారంతో హిమాయత్‌నగర్ మండల అధికారులు అక్కడికి వెళ్లారు. అనుమతి పత్రాలు చూపించమని అడగగా యజమాని చూపించకపోవడంతో ఆర్ఐ కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బోర్‌వెల్ వాహనాన్ని కాచిగూడ పీఎస్‌కు తరలించి, ఇంటి యజమాని మహేశ్వరి, ఆమె కుటుంబ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు.


సత్యనారాయణ శాస్త్రికి నివాళులర్పిస్తున్న శ్రీధర్, జనార్దనమూర్తి తదితరులు

సంప్రదాయ పద్యకవి 'మధునాపంతుల'


చిక్కడపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ పద్యకవి మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి అని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ డా. అయాచితం శ్రీధర్ అన్నారు. బుధవారం త్యాగరాయగానసభలో శతాబ్దిపూర్వ మహనీయుల యాది కార్యక్రమంలో భాగంగా సత్యనారాయణశాస్త్రి సంస్మరణసభ గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యంలో ముఖ్యంగా అచ్చ తెలుగు సాహిత్యంలో పేరెన్నికగన్న కవులలో మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి ప్రముఖుడని అన్నారు. ఆయన రచించిన ఆంధ్రపురాణం కావ్యంలో విశ్వనాథ వారి కవితా ధార, కరుణశ్రీ వంటి కవుల శైలి లాలిత్యం కనిపిస్తాయన్నారు. ప్రముఖ సాహితీవేత్త డా.వడ్డేపల్లి కృష్ణ, సంఘసేవకులు ఆత్మీయ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠినచర్యలు

చిక్కడపల్లి: త్వరలో జరిగే ఎన్నికల నేపథ్యంలో పార్టీలో తిరుగుతూ అల్లర్లు, బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య రౌడీషీటర్లు, పాత నేరస్థులను హెచ్చరించారు. బుధవారం వారిని స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు.

గౌడ కులస్థులకు రెండు ఎంపీ సీట్లు కేటాయించాలి

రాంనగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు గౌడ కులస్థులకు రెండు ఎంపీ సీట్లు కేటాయించాలని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ గడ్డమీది విజయ్‌కుమార్‌గౌడ్, గౌడ సంఘం ఉపాధ్యక్షుడు పోతగాని అయిలయ్యగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో గౌడ కులస్థులకు ప్రాధాన్యం ఇవ్వని పార్టీలకు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అంజన్‌కుమార్‌యాదవ్

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

చిక్కడపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుండు జగదీష్‌బాబు ఆధ్వర్యంలో గాంధీనగర్ డివిజన్ జవహర్ నగర్ కమ్యూనిటీహాల్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో బాటసారుల దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ నాయకులు అభిషేక్ కెన్నడీ, శీలం సత్యనారాయణ, గుర్రం శంకర్, జానకి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న నిరుద్యోగులు

గ్రూప్-2, 3 పోస్టులను పెంచాలి

చిక్కడపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2, 3 పోస్టులను పెంచాలని, డీఎస్సీ ద్వారా 20 వేల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం హైదరాబాద్ నగర గ్రంథాలయంలో అభ్యర్థులు ధర్నా చేశారు. ధర్నాకు కాంగ్రెస్ నాయకుడు బక్క జడ్సన్ మద్దతు తెలిపారు. పలువురు అభ్యర్థులు మాట్లాడుతూ.. గ్రూప్ పోస్టులు పెంచాలని, ప్రభుత్వం నిరుద్యోగులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.


ధన్‌రాజ్‌ను సత్కరించిన బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవీలత,
పుట్టి యాదగిరి ముదిరాజ్ తదితరులు

సనాతన హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి నగర ప్రధాన కార్యదర్శిగా ధన్‌రాజ్

నల్లకుంట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సనాతన హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి నగర ప్రధాన కార్యదర్శిగా బి.ధన్‌రాజ్ నియమితులయ్యారు. బుధవారం సమితి శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి మాధవీలత, సమితి చైర్మన్ పుట్టి యాదగిరి ముదిరాజ్, కార్పొరేటర్ బొక్కా భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి ధన్‌రాజ్‌ను సత్కరించారు. సనాతన హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు టి.యామన్ సింగ్, కోశాధికారి సీ.హెచ్.కాశీబుగ్గ బాబన్న పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కవాడిగూడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. దోమలగూడకు చెందిన ఉల్లంపర్తి దేమూడు(39) గత ఏడాది డిసెంబర్ 23వ తేదీన ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో తండ్రి చిలుకు బుధవారం దోమలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.